క్లుప్తంగా

చంద్రయాన్‌ను కీర్తిస్తూ రంగవల్లిక పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చంద్రయాన్–3 విజయోత్సవం సందర్భంగా విద్యార్థినులకు రంగవల్లిక పోటీలు నిర్వహించారు. దేశ భక్తిని ప్రతిబింభిస్తూ విద్యార్థులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థినులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలను ఎంఈవో కె.పున్నయ్య, హెచ్‌ఎం పార్థసారధి అభినందించారు.

సచివాలయ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగహన కల్పిస్తున్న సిబ్బంది

జి.సిగడాం: గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వం ఆమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై డిగ్రీ విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ప్రతి పథకం పేదలకు మేలు చేసేవిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేస్తున్నారని సిబ్బంది విద్యార్థులకు వివరించారు. విద్యార్థులంతా సచివాలయం వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని ఆనందపురం గ్రామ కార్యదర్శి పైల జయరాం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మాచర్ల గోపాలం సూచించారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



అక్రమకట్టడాన్ని కూలగొడుతున్న అధికారులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కార్పొరేషన్ పరిధిలో అక్రమ కట్టడాలు నిర్మిస్తే ఊరుకునేది లేదని టౌన్‌ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు. శ్రీకాకుళం నగరంలో జి.టి.రోడ్డు, న్యూకాలనీ, పాలకొండ రోడ్డు, గుడివీధులలో అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాలను గురువారం తొలగించారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ అధికారులు మాట్లాడుతూ అనధికారికంగా నిర్మాణాలు చేపడితే సహించేది లేదన్నారు. నిర్మాణాలు తొలగింపులో ఏసీపీ హరిబాబు, టీపీఎస్ అప్పలరాజు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

'న్యూక్లియర్ రియాక్టర్'పై అవగాహన

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో టాక్ ఆన్ క్రాస్ కటింగ్ ఇష్యూస్–న్యూక్లియర్ పవర్–నీడ్ ఆఫ్ ది అవర్ అనే అంశంపై ఐజీసీఏఆర్ కల్పక్కమ్ ఆచార్యులు సి.హెచ్.జగదీశ్వరరావు గురువారం ఉపన్యాసం చేశారు. న్యూక్లియర్ రియాక్టర్ పనిచేసే విధానం, అందులోని రకాలు, ఉపకరణాలు, ఉపయోగాలు, పరిశోధన, ఉద్యోగ అవకాశాలు అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అధ్యక్షులుగా వ్యవహరించారు. న్యూక్లియర్ రియాక్టర్‌కు సంబంధించిన అంశాలపై నిత్యజీవితంలో ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఐక్యూఏసీ కోర్డినేటర్ డాక్టర్ హరిత, కెమికల్ సైన్సెస్ విభాగాధిపతి డి.ఆదినారాయణ, డాక్టర్ రామకృష్ణ, వి.రవికుమార్, డాక్టర్ వంశీకుమార్, డాక్టర్ శాంతిప్రియ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంఘటిత ప్రతిఘటనే సమాధానం

శ్రీకాకుళం అర్బన్: మహిళలపైన దాడులు, ఆకృత్యాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, వీటికి అడ్డుకట్ట వేయాలంటే సంఘటన ప్రతిఘటనే సమాధానమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి అన్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా ఉద్యమకారిణి వి.లక్ష్మి 32వ వర్ధంతి సభ సందర్భంగా పద్మావతి ముఖ్యవక్తగా పాల్గొన్నారు. మహిళలపై హింస–ప్రతిఘటన అనే అంశంపై మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న దాడుల్ని ఐక్యతతో ఎదుర్కోవాలన్నారు. మహిళా సంఘం జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి మాట్లాడుతూ మహిళలపై దాడులు తీవ్రంగా పెరుగుతున్నాయన్నారు. గ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, శ్రీదేవి పాణిగ్రాహి, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ కె. సూర్యచంద్రరావు, మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం.లలిత, డిగ్రీ కాలేజ్ తెలుగు విభాగాధిపతి జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనురాగానికి ప్రతీక రక్షాబంధన్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బలగ హరేరామ మందిరంలో రక్షాబంధన్ వేడుకలు గురువారం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన రాఖీలను శ్రీరాముల విగ్రహానికి కట్టారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందించారు. హరేరామ మందిర భక్త బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వాడవాడలా రాఖీ పౌర్ణమి

గార: రాఖీ పౌర్ణమి సందర్భంగా అక్కతమ్ముళ్లు రాఖీలు కట్టడంతో పాటు మిఠాయిలు పంచుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అన్ని గ్రామాల్లో సందడి నెలకొంది. సీఐ ఎస్.కామేశ్వరరావుకు సచివాలయాల మహిళా పోలీసులు రాఖీ కట్టి, పాటు మిఠాయిలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కిల్లిపాలెంలో రక్షాబంధన్ వేడుకలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కిల్లిపాలెం ఎంపీపీ స్కూల్లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు రాఖీ కట్టుకుని సందడి చేశారు. హెచ్‌ఎం బి.రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రణస్థలం, లావేరు, జి.సిగడాం: రక్షాబంధన్ పండుగను రణస్థలం, లావేరు, జి.సిగడాం మండలాల్లో ఆనందంగా జరుపుకున్నారు. చిన్నా..పెద్దా తారతమ్యం లేకుండా సోదరులకు చెల్లెళ్లు, అక్కలు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. రణస్థలం మండలం మరువాడ హైస్కూల్ విద్యార్థులు భిన్నంగా రక్షాబంధన్‌ను చేపట్టారు. నాకు నీవు రక్ష.. నీకు నేను రక్ష.. మనమిద్దరం దేశానికి రక్ష అంటూ నినాదాలు చేస్తూ మొక్కలకు రాఖీలు కట్టారు. హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు పి.సీతారామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు బి.జి.హరణాద్, జి.చిన్నిక్రిష్ణంనాయుడు ఉన్నారు.



శ్రీకాకుకుళం కల్చరల్: శ్రీరాముడు విగ్రహానికి రాఖీ కడుతున్న అర్చకులు



గార: సీఐ కామేశ్వరరావుకు రాఖీ శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళా పోలీసులు



శ్రీకాకుళం రూరల్: కిల్లిపాలెంలో ఎంపీపీ స్కూల్ రాఖీ వేడుకలు



రణస్థలం: మొక్కలకు రాఖీ కట్టేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

భూముల రీసర్వేతో రైతులకు మేలు



సర్వే ప్రారంభంలో జెడ్పీటీసీ సభ్యుడు సీతన్నాయుడు తదితరులు

లావేరు: సమగ్ర భూముల సర్వేతో రైతులకు మేలు జరుగుతోందని జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు అన్నారు. మురపాక రెవెన్యూ పరిధిలో చేపటనున్న భూముల రీసర్వేను గురువారం ప్రారంభించారు. డ్రోన్ కెమెరాతో గ్రామంలోని రైతులు, ప్రభుత్వ భూములకు ఫొటోలు తీశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ.. రైతులకు భూసమస్యలు ఉండకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి సమగ్ర భూముల సర్వేకు శ్రీకారం చుట్టారన్నారు. సర్వేకు వచ్చే సిబ్బందికి రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె సూర్యప్రకాష్, తేనేల విద్యాసాగర్, పెయ్యల లక్ష్మణరావు, గొర్లె వెంకటప్పలనాయుడు, చిత్రి విజయ్‌కుమార్, కూనపు పోలీస్ లంక రామినాయుడు, రామారావు, వీఆర్వోలు చిన్న, స్వామినాయుడు, సర్వేయర్లు కామేష్, సతీష్ ఉన్నారు.

మొక్కలు పంపిణీ



మొక్కలతో విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు కుప్పిలి అదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మొక్కలను గురువారం పంపిణీ చేశారు. జిల్లా అటవీశాఖ అందజేసిన మొక్కను పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు రెడ్ క్రాస్ ప్రతినిధి సత్యనారాయణ చెప్పారు. రైతులు, ప్రజలు మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

సర్వస్వతీదేవి పుస్తకాల అందజేత

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నాగావళి తీరంలో ఉన్న దత్తపీఠంలో గల గాయత్రీ మాత ఆలయం వద్ద విద్యార్థులకు100 సర్వస్వతీ దేవి పుస్తకాలను, శ్లోకాల మెమెంటోలను పంపిణీ చేశారు. విద్యార్థుల విజయాల సాధన– విద్యాదేవతల ఆరాధన అనే కార్యక్రమంలో భాగంగా గురువారం హయగ్రీవ జయంతి, గాయత్రీ జయంతి, శ్రావణ పౌర్ణమి నిర్వహించారు. నిర్వాహకులు కాశిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది జ్ఞాన సరస్వతికి అంకితంగా 'శ్రీవాణి వికాసం' అనే పుస్తకాన్ని ఉభయ రాష్ట్రాలలోని 10 ఆలయాలలో 1100 పుస్తకాల పంపిణీతోపాటుగా పిల్లలందరి పేరునా అమ్మవారికి అర్చనలు చేశామని తెలిపారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న సుగుణాకరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని శ్రీకాకుళం నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ అండ్ ఇంజినీరింగ్ కార్యనిర్వహణ ఇంజినీర్ పొగిరి సుగుణాకరరావు అన్నారు. చిలకపాలెంలోని శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఇంజినీరింగ్ మొదటి ఏడాది విద్యార్థులకు గురువారం క్లాస్ వర్కు ప్రారంభించి, ప్రేరణ తరగుతుల నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మట్లాడుతూ.. ఇంజినీరింగ్ నాలుగేళ్లలో విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు, కమ్యూనికేషన్ స్కిల్స్, పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాన్ని సాధించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నూతన విద్యా విధానం నేపథ్యంలో విద్యార్థుల్లో నైపుణ్యం అవసరమన్నారు. ఇంటర్న్‌షిప్, అన్‌లైన్ కోర్సులపై దృష్టిసారించాలన్నారు. నైపుణ్యం గల యువతకు పేరున్న కంపెనీల్లో మెరుగైన ప్యాకేజీలు లభిస్తున్నాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, మేనేజ్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 15 మంది ఎంపిక



అధికారులతో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని వెంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చెన్నైకి చెందిన లుమిన– డాటామేటిక్స్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ట్రిపుల్‌ఈ, సీఎస్‌ఈ, ఎంబీఏ విద్యార్థులు 83 మంది హాజరవ్వగా.. అర్హత రాత పరీక్ష, బృంద చర్చలు, వ్యక్తిగత ముఖాముఖి ద్వారా ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు ఆఫర్ లెటర్స్ అందజేశారు. ఇంజినీరింగ్ చివరి సెమిస్టర్ ఉత్తీర్ణత తరువాత ఉద్యోగాల్లో చేరనున్న వీరికి. రూ. 4 లక్షలు వార్షిక వేతనం అందజేయనున్నారు. ఇంటర్వ్యూ ప్రక్రియను హెచ్‌ఆర్ పాట్రిక్‌తో కూడిన బృందం నిర్వహించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీసీ రమణమూర్తినాయుడు, ప్లేస్‌మెంట్ అధికారి ఆనెం అప్పారావు సహకరించారు.

అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ గొండు రఘురామ్

గార: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని ఎంపీపీ గొండు రఘురామ్ సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో జరగనున్న పనులపై గురువారం సమీక్షించారు. మండలంలో 19 సచివాలయాల పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం జరిగిందని, ప్రాధాన్యత మేర పనులకు నిధులు విడుదలయ్యాయన్నారు. పనుల విషయంలో ఏదైనా సమస్య ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంజీవ రమణయ్య, పంచాయతీరాజ్ డీఈఈ అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రామారావు, ఈఓపీఆర్డీ పి.శ్రీనివాసరావు, జి.శేఖర్, అరవల రామకృష్ణ, అంధవరపు బాలకృష్ణమూర్తి, పీస గోపి, కొయ్యాన నాగభూషణం, యాళ్ల నారాయణమూర్తి, తాన్నె అప్పలరాజు, బి.ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సు ప్రారంభం



మాట్లాడుతున్న లక్ష్మణరావు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో గల సత్యసాయి సేవా సమితి బృందావనంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులో భాగంగా బ్యూటీషియన్ కోర్సును రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతులకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో 40 రోజులపాటు ఈ ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఈ కోర్సులో నైపుణ్యం పొందిన యువతులు ఇంట దగ్గర నుంచే ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎన్ని లింగరాజు, జిల్లా సేవాదళ్ సమన్వయకర్త సూర రామచంద్రరావు, మహిళా విభాగం సేవాదళ్ సమన్వయకర్త ఎం.అమ్మాయమ్మ, జోనల్ కన్వీనర్ పి.నాగేశ్వరరావు, మందిరం కన్వీనర్ ప్రసాదరావు, డాక్టర్ మాలతి, బెండి రమాబాయి, మామిడి సుజాత, దోకి జనార్దన, తంగుడు ప్రసాద్, ఆర్.రమణమూర్తి, ప్రమీల, దివ్య, సుజాత, భక్తులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

రణస్థలం: మండల కేంద్రంలో సీఐ కార్యాలయం వెనుక సర్వే నంబర్ 2–1లో 13 సెంట్ల వివాదాస్పద స్థలం గ్రామకంఠంగా ఉందని పంచాయతీ అధికారి లింగాల ఆదినారాయణ తెలిపారు. ఈ స్థలానికి సంబంధించి మండల తహసీల్దార్ సనపల కిరణ్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామన్నారు. స్థలం వివాదం హైకోర్టులో పెండింగ్ ఉన్నందున తదుపరి తీర్పు వెలువడేంత వరకు ఎటువంటి చర్యలు చేపట్టరాదని హెచ్చరిస్తూ బోర్డు ఏర్పాటు చేశామన్నారు. అలాగే రెవెన్యూ అధికారులు స్థలానికి సంబంధించి హద్దులు నిర్ణయిస్తే తదుపరి పర్యవేక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ ఆదేశాల ప్రకారం హద్దులు నిర్ణయించిన తరువాత టీడీపీ నాయకుడు డీజీఎం ఆనందరావు వివాదాస్పద స్థలంలో చేస్తున్న కార్ పార్కింగ్ షెడ్‌ను తొలగిస్తామని చెప్పారు. బోర్డు ఏర్పాటులో గ్రామ రెవెన్యూ అధికారి వై.జగన్నాథం ఉన్నారు.

వృత్తి నిబద్ధతకు వీఎస్ పంతులు ఆదర్శం



పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సీనియర్ న్యాయవాది వీఎస్ పంతులు వృత్తి నిబద్ధత, క్రమశిక్షణ నేటితరం యువ న్యాయవాదులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అన్నారు. జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో గురువారం వీఎస్ పంతులు వర్ధంతి నిర్వహించారు. వీఎస్ పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్ని సూర్యారావు, శిష్టు రమేష్ మాట్లాడుతూ వీఎస్ పంతులు వత్తి పట్ల ఎంతో క్రమశిక్షణ, చిత్తశుద్ధితో మెలిగేవారని, ఆయన చనిపోయిన రోజు కూడా కోర్టుకు హాజరైన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడిగా ఉంటూ ఎందరో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను అభివద్ధిలోకి తెచ్చారన్నారు. ఆయన టెన్నిస్‌లో ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌గా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బెజ్జిపురపు ఫల్గుణరావు, కార్యదర్శి పొన్నాడ రాము, ఎం.భవానీప్రసాద్, సనపల హరిప్రియ, గుంగు భాస్కరరావు, సీనియర్ న్యాయవాదులు కూన అన్నంనాయుడు, సనపల హరి, బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, ఎ.కృష్ణంరాజు, బీవీ రమణ, చౌదరి లక్ష్మణరావు, మూగి నర్సింగరావు, వీఎస్ పంతులు కుటుంబ సభ్యులు వీవీఆర్ఎస్ మూర్తి, రవిశంకర్, సుధ, జస్టిస్ బి.అప్పారావు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌తో ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేఖ

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ పురుషుల కళాశాలలో స్పోకెన్ ఇంగ్లిష్ ముగింపు కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. గత 31 రోజులుగా ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్, లైఫ్ స్కిల్స్ ప్రోగ్రాం బెంగళూరుకు చెందిన ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాపి సురేఖ హాజరయ్యారు. ప్రతీ ఒక్క విద్యార్థికి ఈ రోజుల్లో స్పోకెన్ ఇంగ్లిష్, లైఫ్‌స్కిల్స్ చాలా అవసరమని, వాటిని తమ కళాశాలలో నిర్వహించిన ఉన్నతి సంస్థకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కోర్స్ కాల వ్యవధిని ఇంకా పెంచితే ఎక్కువ మంది విద్యార్థులకు ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ హరిత మాట్లాడుతూ ఇటువంటి కోర్సులు ఉన్నతి ఫౌండేషన్ వారు అందించడం ఆనందంగా ఉందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం అన్ని ప్రభుత్వ డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నికల్ కాలేజీలలో నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధి రంజిత్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల జువాలజీ అధ్యాపకులు రవిబాబు, అర్థశాస్త్ర అధ్యాపకులు సి.హెచ్. రామమూర్తి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈస్ట్‌కోస్ట్ రైల్వే కన్సల్టేటివ్ సభ్యుడిగా పొన్నాడ



పొన్నాడ రవికుమార్

శ్రీకాకుళం అర్బన్: ఈస్ట్‌కోస్ట్ రైల్వే కన్సల్టేటివ్ శ్రీకాకుళం కమిటీ సభ్యుడిగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమదాలవలసలో ఈస్ట్ కోస్ట్ రైల్వే కన్సల్టేటివ్ శ్రీకాకుళం కమిటీ సభ్యుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. రైల్వే కన్సల్టేటివ్ సభ్యులు జె.వెంకటేశ్వరరావు, టి.గీత, జె.రవిబాబు, ఎస్. నర్సింగరావు, డాక్టర్ ఎం.కృష్ణప్రసాద్, జె.వి.భాస్కరరావు, ఎ.రామకృష్ణ, తమ్మన బంగారురాజు, స్టేషన్ మేనేజర్ మొదలవలస రవికుమార్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

కాలుష్య నివారణపై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ప్రజల్లో కాలుష్య నివారణపై అవగాహన పెంచాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో గురువారం న్యాయ సదన్‌లో సమావేశం నిర్వహించారు. రోజురోజుకూ పెరుగుతున్న వాయు, శబ్ద, నీటి కాలుష్యాన్ని నివారించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు పెంచడం ద్వారా కలుష్య నివారణ కొంత మేర తగ్గించగలమని, ఆ దిశగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజినీర్ రామారావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

లావేరు: పంటల సాగులో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తకోట గ్రామంలో ప్లాంట్ క్లినిక్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మొక్కజొన్న, పత్తి, వరితోపాటు మిగతా పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పత్తి పంటలో వచ్చే సూక్ష్మదాతు లోపాలు, పంటను ఆశించే కాయతొలిచే, గులాబీ రంగు పురుగు నివారణ, వరిలో పటాస్ దాత సవరణ, మొక్కజొన్న పంటకు వచ్చే వడ తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. పంటలకు తెగుళ్లు ఆశిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే నివారణకు మందులు స్ప్రే చేయాలన్నారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడలోని మహాధన్ అగ్రిటెక్ పరిశ్రమ యాజమాన్యం రోడ్డు మరమ్మతు పనులు గురువారం ప్రారంభించింది. రూ. 4.30 లక్షలతో తోటపాలెంలోని నీలమ్మ గుడి నుంచి పరిశ్రమ వరకు రోడ్డు మరమ్మతులు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు పరిశ్రమ మాజమాన్యం దృష్టికి సమస్య తీసుకెళ్లడంతో మరమ్మతులకు ముందుకొచ్చారు. పనులు రెండు రోజుల్లో పూర్తికానున్నాయి.

కేంద్రానికి వ్యతిరేకంగా సీపీఎం నిరసన

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం నాయకులు గురువారం సమరభేరి నిరసన కార్యక్రమాన్ని ఎచ్చెర్లలో చేపట్టారు. పెంట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల నాలుగో తేదీన మండల కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు చెప్పారు. జిల్లా కమిటీ సభ్యుడు పి.తేజేశ్వరరావు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతాలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సానివాడ గ్రామంలో గల గీతామందిరంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతాలు గురువారం చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 40 మంది దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు రుప్ప రమణమూర్తి, ధర్మప్రచార కర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.